అమృతంలో విషం!

వాణిశ్రీ

శరభయ్య గూడు రిక్షాని హుషారుగా తొక్కుకుంటూ వస్తున్నాడు.

పగలంతా రిక్షా తొక్కి తొక్కి రోజూ ఆ సమయానికి నీరసపడిపోయి వుండేవాడు. వుసూరుమంటూ రిక్షాని యజమానికి అప్పజెప్పి ఇంటికి పోయేవాడు.

కాని ఈ రోజు శరభయ్య భార్య చేపలపులుసు చేసింది. మధ్యాహ్నం భోజనం చేసి వస్తుంటే తోట్టి ప్రక్కన బండమీద పెద్ద బొచ్చ చేపను రుద్దుతూ "పెందలాడే కొంపకిరా!" అంది అతని భార్య.

చేపలపులుసంటే శరభయ్యకి ఎంతో ఇష్టం. సారాయి త్రాగిన తర్వాత చేప తినడం చెప్పలేనంత ఇష్టం.

ఆ రోజు సంపాదన కూడా బాగానే వుండడం అతనికి మరింత హుషారుగా వుంది. రిక్షా అద్దెపోను పది రూపాయలు మిగులాయి. ఐదురూపాయలు దానికిచ్చినా ఐదురూపాయలు సారాయి త్రాగొచ్చు అనుకున్నాడు.

కోడూరునుంచి టౌన్‌కి, టౌన్‌నుంచి కోడూరుకి సరుకుల్ని మనుషుల్ని గూడు రిక్షామీద చేరవేసి సంపాదిస్తున్నాడు శరభయ్య. టౌన్‌లోకంటే ఇక్కడే బాగుంటుంది బేరం. పోటీ తక్కువ.

కోడూరునుంచి చీకటిపడిన తర్వాత లాస్టు ట్రిప్ ఖాళీగా వస్తున్న శరభయ్యకి హోటలు మధువనం దగ్గర బేరంతగిలింది. హోటలు మధువనం టౌన్ చివర విశాలమైన ఆవరణలో వుంది.

పొడుగ్గా తెల్లటి బట్టలువేసుకున్న అతను ఎవరో బండి ఆపమన్నట్లు చెయ్యి ఎత్తాడు. అతనికి గడ్డం కూడా వుంది.

"హాస్పటల్‌కి వస్తావా?"

తలవూపాడు శరభయ్య వస్తానన్నట్టు.

తనవెంట రమ్మనమని సైగచేసి దారితీశాడు అతను. షార్టుకోలోంచి ప్రక్క సందులోకి వెళ్ళాడు. హోటలు రూమ్ముందు ఆగింది రిక్షా. శరభయ్య తలెత్తి చూశాడు. తలుపుమీద 26 నెంబరు ఇత్తడి అక్షరాలు వున్నాయి. అతను తలుపు తెరిచాడు.

"లోపలకు రా!" అన్నాడు.

శరభయ్య లోపలకు వెళ్ళాడు. బెడ్ మీద ఆడమనిషి పడుకొని ఆయాసపడుతోంది విపరీతంగా.

"ఈమె ఆస్మా పేషెంటు. జాగ్రత్తగా నెమ్మదిగా తీసుకెళ్ళాలి."

తలవూపాడు శరభయ్య.

"ఏమివ్వమంటావు?"

"రూపాయిన్నర ఇవ్వండి బాబూ!" అన్నాడు శరభయ్య. రూపాయిన్నర అడిగితే కనీసం రూపాయి

అయినా ఇస్తాడని అతని ఆశ.

ఆ గడ్డం అతను రెండు కాగితం ఇచ్చాడు.

"నువ్వు అడిగిన దానికన్నా అగ్గరూపాయి ఎక్కువ ఇచ్చాను. ఆమెను జాగ్రత్తగా తీసుకెళ్ళాలి."

"అలాగే బాబూ! నాకా మాత్రం తెలీదా!" అన్నాడు శరభయ్య హుషారుగా. అనుకోకుండా రెండు రూపాయల బేరం తగిలినందుకు ఆనందంగా వుంది.

"కొంచెం కాళ్ళదగ్గరపట్టు రిక్షాలో పడుకో బెడదాం" అన్నాడు అతను.

శరభయ్య ఆమెను కాళ్ళదగ్గర పట్టుకున్నాడు. ఇద్దరూ కలిసి రిక్షాలో పడుకోబెట్టారు ఆమెను. అతను దుప్పటి తెచ్చి కప్పాడు ఆమెకు. ఆమె స్పృహలో లేదు.

"మాది ఈ వూరుకాదు. ఏలూరు. అనుకోకుండా ఆమెకు జబ్బుచేసింది" అన్నాడు అతను విచారంగా.

"సరే! నువ్వుమాత్రం జాగ్రత్తగా పోతూవుండు. నేను సైకిలుమీద వచ్చి నిన్ను కలుసుకుంటాను" అన్నాడతను.

శరభయ్య బయల్దేరాడు.

"జాగ్రత్త. ఆమెకు చలి గాలి తగలగూడదు. ఉబ్బసం రోగికదా! దుప్పటి తొలిగిపోతుందేమో అప్పుడప్పుడూ చూస్తూ వుండు."

శరభయ్య తల వూపుతూ రిక్షా లాగించాడు. అతను చెప్పినట్లు అప్పుడప్పుడూ రిక్షాలో పడుకున్న ఆమెవంక చూస్తూనే వున్నాడు దుప్పటి తొలిగిపోతే సరిచేద్దామని. కాని అతనికా అవసరం రాలేదు.

ఆమెను చూస్తే నిండా పాతికేళ్ళు లేవు. నిమ్మ పండులా నిగనిగలాడుతూ అందంగా వుంది. ఇంత చిన్న

వయసులోనే ఆ జబ్బు ఏమిటో అనుకున్నాడు శరభయ్య. ఆమెమీద ఎందుకో జాలికలిగింది. పాపం! ఏం మాయదారి రోగమో అనుకున్నాడు.

టౌన్‌లోకి వెళ్ళేసరికి పూర్తిగా చీకటి పడింది. చలికాలం ఏమో ఆరున్నరకే చీకట్లు క్రమ్ముకునిపోయాయి. దారిలో రిక్షా ఆపి టైటువెల్గించి బయల్దేరాడు శరభయ్య.

హాస్పిటలులో పోర్టికోలో రిక్షా ఆపాడు. తిరిగి చూశాడు ఆ గడ్డంబాబు కనిపిస్తాడేమోనని. వుహూం.. ఎక్కడా కనిపించలేదు. వస్తూ వుంటాడులే అనుకుని బీడీ ముట్టించాడు. పావుగంట గడిచింది. అతను రాలేదు.

క్యాజువాల్టీ వార్డు దగ్గర నిల్చున్న వార్డుబాయ్ అడిగాడు శరభయ్యని.

"పేషెంటుకి ఏం జబ్బు?"

"ఉబ్బసం" అన్నాడు శరభయ్య.

"తీసుకొచ్చి లోపల పడుకోబెట్టు. బైట చలిగాలి" అన్నాడు.

"కొంచెం సాయం రా అన్నా!" అన్నాడు శరభయ్య.

వార్డుబాయ్ మెట్లు దిగివచ్చాడు.

"ఏం నడవలేదా?" అన్నాడు.

"వుహూం....చాలా ఎక్కువగా వుంది" అన్నాడు శరభయ్య.

వార్డు బాయ్ దుప్పటిలాగి ఆమెను ముట్టుకుని చూశాడు. శరీరం చల్లగా వుంది. కూర్చోబెట్టాలని ప్రయత్నించాడు కాని శరీరం బిగుసుకుపోయి వుంది. అతనికి అనుమానం వచ్చింది, ప్రాణం పోయిందని.

అప్పుడే అటుగా పోతున్న డాక్టర్ లతీఫ్ కనిపిం

చాడు వార్డు బాయ్‌కి.

"సార్!" అన్నాడు వార్డుబాయ్.

డాక్టర్ దగ్గరికి వచ్చి "ఏమిటి వెంకటయ్యా?" అన్నాడు.

"కొంచెం పేషెంటుని చూడండి సార్!"

"లోపలకు తీసుకువెళ్ళు. డ్యూటీ డాక్టర్ వున్నాడుగా?"

"అదికాదు సార్!" అంటూ తన అనుమానం వెల్లడించాడు వార్డుబాయ్ వెంకటయ్య.

డాక్టర్ లతీఫ్ ఆమెను చూసి "చచ్చిపోయిందయ్యా!" అన్నాడు.

శరభయ్య గుండె గుభేలుమంది.

డాక్టర్ చరచర నడిచివెళ్ళిపోయాడు.

"పోయిందట. ఇక ఇంటికి తీసుకెళ్ళు!" అన్నాడు వార్డుబాయ్ వెంకటయ్య.

"ఎక్కడికి తీసుకెళ్ళను? ఈమె ఎవరో నాకు తెలీదు" అన్నాడు శరభయ్య ఆందోళనగా.

"మరి తేలీకుండా ఇక్కడికి ఎలా తీసుకొచ్చావ్?"

"నేను కోడూరునుంచి వస్తుంటే మధ్యలో మధువనం హోటలు దగ్గర ఒకాయన బండి ఆపి ఎక్కించాడు. వెనక సైకిలేసుకుని వస్తానన్నాడు. ఇంతవరకూ రాలేదు" అన్నాడు శరభయ్య.

"రిక్షా ఎక్కించినప్పుడు బ్రతికుందా?"

"ఆఁ.... బాగా ఆయాసపడుతూ వుంది."

"ఏం చేస్తాం? వెనక్కి తీసుకెళ్ళు" అన్నాడు వార్డుబాయ్.

"ఎక్కడికి తీసుకెళ్ళమంటావు? ఆయన ఇంకా

రాలేదే?" శరభయ్యకి కంగారు ఎక్కువైంది.

"ఎక్కడ్నుంచి తీసుకొచ్చావో అక్కడికే తీసుకెళ్ళు. ఆయనెవరో వస్తూవుంటాడులే!" అన్నాడు వార్డుబాయ్.

"నాకిప్పుడు అనుమానంగా వుంది."

"ఎందుకు?"

"ఆయనెవరో నా కొంప ముంచడానికి ఈ రోగిష్టి దాన్ని నా బండిలో ఎక్కించాడు" ఏడుపు ముఖం పెట్టి అన్నాడు శరభయ్య.

శరభయ్య అవస్థచూసి వార్డు బాయ్‌కి నవ్వువచ్చింది.

"భలేవాడివే. ఎందుకలా భయపడతావ్?"

"నీకు అలాగే వుంటుందిలే అన్నా! అరగంటయింది వచ్చి. ఆ మనిషేమో అంతూ దరీ లేదు. నే నిప్పుడేం చెయ్యాలి. ఈ శవం ఎంతసేపు వుంచను బండిలో. కొంచెం సాయంపట్టు అన్నా! నీకు పుణ్యం వుంటుంది. ఇక్కడ పడేసి నా దారిన నేను పోతా!" అన్నాడు శరభయ్య.

"చాలు....చాల్లే సామీ! శవాన్ని ఇక్కడ పడేసి పోతావా? మొనగాడివే లెద్దూ! పోలీసులొచ్చి మా ప్రాణం తింటారు. అంతగా తొందరగా వుంటే పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి శవాన్ని వాళ్ళకి ఇచ్చిపో" అన్నాడు వార్డు బాయి.

"వాళ్ళు నన్ను ఏవీ....అనరుగా!"

"నీకెందుకు భయం. జరిగిందంతా చెప్పు" అన్నాడు.

2

శరభయ్య దిక్కులు చూస్తూ రిక్షా లాగుతున్నాడు ఆ గడ్డంమినిషి ఎక్కడన్నా కనిపిస్తాడేమోనని చూస్తూ.

హాస్పటల్లోంచి బైటపడ్డాడుగాని పోలీస్ స్టేషన్‌కి

వెళ్ళాలంటే గుండె ధైర్యం చాలేదు. ఎందుకైనా మంచిది మళ్ళీ ఆ హోటలుకే తీసుకెళ్తే సరి అనుకున్నాడు.

అంత దూరం రిక్షా తొక్కాడు వుసూరుమంటూ. పోయేటప్పుడున్న ఉత్సాహం లేనేలేదు. భయం.... భయంగా వుంది లోపల. ఆ గడ్డంవాడు తనని మోసం చేశాడేమోనని అనుమానంగా వుంది.

అసలు వెంటమనిషి లేకుండా రిక్షా పోనివ్వడం తనదే తప్పు. ఇలా జరుగుతుందని ఎవడనుకున్నాడు? అర్థ రూపాయి ఎక్కువిచ్చాడని పరిగెత్తాడుగాని శవాన్ని మోసుకుని తిరగాల్సి వస్తుందని కలకన్నాడా ఏం?

హోటలు మధువనం మెయిన్ గేటులో వాచ్ మెన్ అతని రిక్షా ఆపేశాడు.

"నువ్వు పోయిరా కావాలంటే" అన్నాడు.

శరభయ్య కౌంటర్లో కూర్చున్న వ్యక్తిని అడిగాడు.

"గడ్డం బాబు ఎక్కడున్నాడు బాబు?"

కౌంటర్లో వ్యక్తి చిరాకుగా చూసి "ఏ గడ్డం బాబు? పేరూ ఊరూ లేదా?" అన్నాడు.

"నాకు పేరు తెలీదు బాబూ! ఇరవై ఆరో నెంబరు గదిలో వున్నాడు ఆ బాబు. గదిలో లేడు. తాళం వేసి వుంది. చూసొచ్చాను" అన్నాడు శరభయ్య.

కౌంటర్లో వ్యక్తి రిజిష్టర్ ఎత్తిచూసి "అందులో గడ్డంవాడెవడయ్యా? అమృతం అనే ఆవిడ గది తీసుకుంది" అని ముఖం చిట్లించాడు. అతనికి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. అంతకు క్రితమే గడ్డంమనిషి రూమ్ ఖాళీ చేసిన సంగతి. అవును ఆ గడ్డం మనిషి తను ఆమె భర్తనని చెప్పకున్నాడు.

"ఆ గది ఖాళీ అయిపోయిందోయ్! ఎవరూ లేరు" అన్నాడు.

ఆ మాట వినగానే శరభయ్యకి పిడుగు నెత్తిన పడ్డట్లయింది. వణుకుపుట్టింది భయంతో. అతని ముఖం వెలా వెలా పోయింది.

"అయ్య బాబోయ్! ఇప్పుడు నేనేం చెయ్యాలి? ఆ గడ్డపోడు నా కొంపముంచాడు దేవుడోయ్!" అని కేకలు పెట్టాడు శరభయ్య.

"ష్!....ష్!....ఏయ్!....ఏమిటా కేకలు? ఆ గడ్డపాయన నీకేమైనా డబ్బులివ్వాలా ఏం?"

"డబ్బులు కాదు నా బొందా కాదయ్యా! ఇందాక ఒక ఆడమనిషిని రిక్షాలో ఎక్కించాడు హాస్పిటలుకు తీసుకెళ్ళమని. ఉబ్బసం జబ్బని నెమ్మదిగా తీసుకెళ్ళమనీ తను వెనుక సైకిలేసుకుని వస్తానని చెప్పాడు. నేను హాస్పిటలికి తీసుకెళ్ళేసరికి ఆ మనిషి చచ్చిపోయిందయ్యా!"

కౌంటర్లో వ్యక్తి సీట్లోంచి ఎగిరిపడ్డాడు ఆ మాట వినగానే.

"ఏమిటీ చనిపోయిందా?"

"అవునయ్యా బాబూ! వాళ్ళేమో పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళమన్నారు. ఆ గడ్డపాయన రాక పోయె! ఇక్కడ వుంటాడేమోనని తీసుకొచ్చాను శవాన్ని."

"ఏమిటీ శవాన్ని తీసుకొచ్చావా? ఎక్కడుంది?" కంగారుగా అన్నాడు.

"బైట రిక్షాలో వుంది."

"హమ్మయ్య! అక్కడేవుంచు. లోపలకు మాత్రం తీసుకురామాక పాడు పీడ. అట్నుంచటే తీసుకెళ్ళి పోలీసుల కివ్వు. ఆ తర్వాత సంగతి వాళ్ళు చూసు

కుంటారు."

"అక్కడికి నేను పోను. వాళ్ళు నన్ను చంపుతారు. నేను ఇక్కడ్నుంచి తీసుకెళ్ళాను. ఇక్కడే పారేసి పోతాను" అన్నాడు శరభయ్య.

"ఇక్కడ పారేసిపోతావా? ఇక్కడెవరున్నారని, ఆ గడ్డంమనిషి లేనే లేదు గదా!"

"అవన్నీ నాకు తెలీదు. ఆ గది ముందు పారేసి పోతాను."

"నీకేమన్నా మతిగాని పోయిందా ఏమయ్యా? ఇది హోటలనుకున్నావా ఇల్లనుకున్నావా? శవాన్ని ఇక్కడ పడేస్తే ఎట్లాగయ్యా?"

"నన్నేం చెయ్యమంటారైతే?" శరభయ్య అసహనంగా కేక పెట్టాడు.

"నా మాట విని పోలీస్ స్టేషన్ కెళ్ళి చెప్పు. వాళ్ళేదో చేస్తారు. ఇదుగో ఈ పది వుంచుకో" అంటూ ఆ వ్యక్తి కౌంటర్ దిగివచ్చి పదిరూపాయలు శరభయ్యకి ఇచ్చాడు.

పదికాగితం చేతిలోపడ్డాక శరభయ్య శాంతించాడు. రిక్షాలాక్కుని బయల్దేరాడు. పోలీస్ స్టేషన్ కి వెళ్ళాలంటే మాత్రం ధైర్యం చాలడంలేదు. గుండె ధైర్యానికని ఊరి చివర సారాయి త్రాగాలని నిశ్చయించుకున్నాడు.

టౌన్ చివర గుడిసెలమధ్య గవర్నమెంట్ సారాయి దుకాణం వుంది. శరభయ్య రిక్షా ఆ ప్రక్కన ఆపాడు చీకట్లో.

గ్లాసులో సారాయి పోసుకుని మిరపకాయ బజ్జీల పొట్లాం పట్టుకుని కూర్చున్నాడు శరభయ్య.

"ఏరోయ్! శరభా! పెందలాడే వచ్చావ్? గిరాకీ బాగుందా?"

"రారా రోసిగా!" అంటూ జరిగిన కథంతా చెప్పాడు శరభయ్య. తను చెప్పిన గొడవంతా వింటు న్నందుకు రోశయ్యకి సారా తనే పోయించాడు శరభయ్య. హోటలాయన ఇచ్చిన పది ఖర్చయిపోయింది.

"రోసిగా! పోలిస్ స్టేషన్‌కి పోవాల. కాస్త తోడు రా....రా!" అని రోశయ్యను అభ్యర్థించాడు, శరభయ్య.

"ఆ మనిషి ఎవరో సూడనియ్యి...." అని రోశయ్య రిక్షా లైటుతీసుకుని దుప్పటి తొలగించి ఆమెను చూశాడు.

"ఎవర్రా ఆ మనిషి నీకు తెలుసా?"

"ఎక్కడా చూసినట్టులేదు. ఏ కంపెనీ మనిషే మోనని చూశా! .... అది సరేగాని ఈ శవం పోలీసోళ్ళకి ఇస్తావా?"

"ఆఁ... ఇయ్యక మనవేం సేసుకుంటాంరా ఎర్రి నాయాలా?" అని నవ్వాడు శరభయ్య.

"అర్ధ్యమాత్రం ఏం చేస్తారేం! ఆ మనిషి మెళ్ళో బంగారం కాస్తా కాజేసి పూడ్చిపెడ్తారు. మనమే ఆ పనిచేస్తే పోలా?" అన్నాడు రోశయ్య.

శరభయ్య మనసులో ఆశ మొలకెత్తింది. ఆ సంగతి తనకెందుకు తట్టలేదు? అని విచారించాడు. రోశయ్య దేవుడిలా కనిపించాడు. లేకపోతే తను ఈ బంగార మంతా పోలీసోళ్ళ మొఖాన పోసివుండేవాడు గదా! అనుకున్నాడు.

"అట్టాగే కానీయ్! బంగారం అమ్మి చెరిసగం పంచు కుందాం. పాపం ఎవరోగాని మన దరిద్రం వదలడానికి వచ్చింది" అని రోశయ్య చెప్పినట్లు చెయ్యడానికి ఒప్పు కున్నాడు శరభయ్య.

"సార్! ఇరవై ఆరో నెంబర్ గదిలో దిగిన అమృతం చచ్చిపోయింది" అన్నాడు.

మధువనం ప్రొప్రయిటర్ నారాయణరావు ఆ మాట విని అదిరిపడ్డాడు. తెల్లబోతూ రిసిప్షనిస్టు వంక చూశాడు.

"ఏమిటీ నిజమేనా? ఎందుకు చచ్చిపోయింది?" అన్నాడు.

"ఆమె దిగింది మొన్న రాత్రిగదా! ప్రొద్దున్నే ఆవిడ మొగుడు దిగాడు. పేరేమిటో తెలియదు. గడ్డం పెంచుకుని వున్నాడు. నిన్న సాయంకాలం ఆవిడకు వుబ్బసం ఎక్కువైందని రిక్షా ఎక్కించి హాస్పిటలుకు పోనివ్వమన్నాడట. అక్కడికి పోయేటప్పటికి ఆవిడ పోయిందట."

"అయ్యో! పాపం...." అన్నాడు నారాయణరావు సానుభూతి చూపిస్తూ.

"కాని ఆవిడ మొగుడు హాస్పిటలుకు పోలేదు."

"మరి! ఎటు పోయాడు?"

"ఏమో సార్! ఆవిడ్ని రిక్షా ఎక్కించి తను రూమ్ ఖాళీచేసి వెళ్ళిపోయాడు. గంటతర్వాత రిక్షావాడు శవాన్ని తీసుకుని ఇక్కడికి వచ్చాడు.

"ఏమిటీ?"

"నిజం సార్! వాడొచ్చి ఒకటే న్యూసెన్సు చేశాడు. శవాన్ని ఇక్కడ పారేసి పోతానంటాడు. పదిరూపాయలు వాడి మొఖానకొట్టి శవాన్ని పోలీసులకు అప్పగించమన్నాను సార్!"

"చంపేశావు పోవయ్యా! అంతకంటే ఒక వంద వాడికిచ్చి శవాన్ని పాతిపెట్టిస్తే పోయివుండేది. ఇప్పుడా

పోలీసుల నోటీస్ కిపోతే ఎంత గొడవ జరుగుతుందో? ఛ....ఛ....ఏం పని చేశావయ్యా? అసలే మనం బ్రోతల్స్ కి రూమ్స్ ఇస్తున్నామని ఒకటే ఏడుస్తున్నారు పోలీసులు" అన్నాడు నారాయణరావు.

"ఇటువంటి కేసులు పోలీసుల నోటీసుకి వెళ్ళకపోతే ఎలా సార్?"

"వెళ్తే ఎలా? వాళ్ళొచ్చి వేసే యక్ష ప్రశ్నలకు ఎవరు సమాధానం చెప్తారయ్యా! మీరంతా బాగానే వుంటారు. మధ్యలో నా చావు కొచ్చింది" అని విసుక్కున్నాడు నారాయణరావు.

అతను తప్పు చేసిన వాడిలా నిల్చున్నాడు.

"సరే నువ్వుపో. నా తిప్పలు నేను పడతాను" అన్నాడు.

అతను వెళ్ళిపోయాడు.

అమృతం ఆటోలో వచ్చి దిగినప్పుడు నారాయణరావు కౌంటర్లోనే వున్నాడు. రిసెప్షనిస్టు విజిటర్స్ రిజిష్టర్లో ఆమెతో సంతకం చేయించుకుని 26 నెంబర్ రూమ్ ఇచ్చాడు.

ఒంటరిగా వచ్చిన ఆడది. మంచి వయసులో వుంది. బ్రోతలు కాదుగదా అనే సందేహం వచ్చింది. ఆమెని కనిపెట్టమని బాయ్‌కి చెప్పి వుంచాడు. అటువంటిదైతే తనూ ఒక చూపు చూద్దామని అనుకున్నాడు.

ఇంతలో ఈ ఘోరం జరిగింది.

అసలా అమృతం జబ్బుతో చచ్చిపోయిందా! లేక మొగుణ్ణని వచ్చినవాడు 'చంపి రిక్షాలో పంపించి పోయాడా అనే అనుమానం వచ్చింది నారాయణరావుకి.

యెందుకైనా మంచిది పోలీసులు వచ్చి అడిగేవరకూ

వుండటం ఎందుకు? ముందే వివరాలన్నీ వాళ్ళకి చెప్తే గొడవలేకుండా పోతుంది. తను లేనప్పుడొస్తే ఇక్క-డున్న మేనేజర్ భయపడి ఏదేదో వాగుతాడు అనుకున్నాడు.

టెలిఫోన్ రిసీవర్ ఎత్తి పోలీస్ సూపరింటెండ్ కి రింగ్ చేశాడు.

“గుడ్ మాణింగ్ సార్! నేను నారాయణరావుని హోటలు మధువనం నుంచి మాట్లాడుతున్నాను సార్!”

“వెరీ గుడ్ మార్నింగ్ మిష్టర్ నారాయణరావ్! హౌ ఆర్ యూ?”

“ఓ.కే. సార్!”

“ఏమిటి విశేషాలు.”

“చిన్న విశేషం సార్!”

“అయితే పెద్దదే నన్నమాట. చెప్పండి” నవ్వు వినిపించింది.

“పెద్దదేం కాదు సార్! చిన్నదే. మా హోటల్లో అమృతం అనే ఆవిడ గది తీసుకుంది సార్!”

“ఎప్పుడు?”

“డిసెంబర్ మూడో తారీఖున.”

“ఆఁ.... చెప్పండి. ఏం జరిగింది?”

“ఐదో తారీఖు వుదయం....అంటే నిన్న వుదయం ఆమె భర్త వచ్చాడు. నిన్న సాయంకాలం ఆమెకు ఉబ్బసం యెక్కువైందని రిక్షా మాట్లాడి అందులో పడుకోబెట్టి హాస్పిటలుకు తీసుకెళ్ళమనీ, తను వెనుక సైకిలు మీద వస్తానని చెప్పి పంపాడు. ఆ రిక్షావాడు ఆవిడను హాస్పిటలుకు తీసుకెళ్ళేసరికి చనిపోయింది. రిక్షా

వాడిని పింపించి ఆవిడ మొగుడు రూమ్ ఖాళీచేసి వెళ్ళి పోయాడు."

"ఏం యెందుకని? అసలు వాడు మొగుడేనా?"

"ఏమో సార్! అర్థం కావడంలేదు,"

"తర్వాత ఏం జరిగింది?"

"ఆ రిక్షావాడు శవాన్ని ఇక్కడకు తీసుకొచ్చి గోల పెట్టాడు. మా మేనేజర్ శవాన్ని పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళమని రిక్షావాడికి చెప్పి పంపాడట. ఇదంతా ఇప్పుడే నాకు తెలిసింది సార్!"

"ఇందులో ఏదో గొడవ వుంది. వాడెవడో ఆవిడ మొగుడై వుండడు."

"నేనూ అదే అనుకుంటున్నాను సార్!"

"సరే నేను కనుక్కుంటాలెండి. అవసరమైతే రిటెన్ కంప్లెంట్ ఇవ్వండి."

"థాంక్స్ సార్!"

నారాయణరావు రిసీవర్ క్రెడిలు చేసి ఊపిరి పీల్చుకున్నాడు.

4

యస్.పీ, డి.ఎస్పీని, డియస్పీ సర్కిలు ఇన్స్పెక్టర్లనీ అమృతం శవం ఏం చేశారని వివరాలు అడిగారు. కాని ఏ రిక్షావాడూ అమృతం శవాన్ని పోలీసులకు అప్పగించ లేదని తెలిసింది.

అమృతం శవాన్ని రిక్షావాడు ఏం చేసుకుంటాడు? హోటలునుంచి పోలీస్ స్టేషన్‌కి అమృతం శవాన్ని తీసుకెళ్తుంటే మధ్యలో ఆమె భర్త కన్పించి శవాన్ని స్వాధీనం చేసుకుని వుండొచ్చు.

లేదా శవం మీద విలువైన వస్తువులు తీసుకుని రిక్షా

వాడే యెక్కడైనా పూడ్చిపెట్టి వుండొచ్చు.

రెండువిధాలా జరగడానికి ఆస్కారం వుంది. అసలు ఏం జరిగిందో తెలుసుకోవడానికి క్రైమ్ ఇన్స్పెక్టర్ వినయ్‌కి కేసు అప్పగించారు.

వినయ్ కేసుని హోటలు మధువనం నుంచి పరిశోధించాలని నిర్ణయించుకున్నాడు.

ఇన్స్పెక్టర్ వినయ్ వెళ్ళేసరికి హోటలు ప్రొప్రయిటర్ నారాయణరావు ఆఫీస్‌రూమ్‌లో వున్నాడు. సాదరంగా ఆహ్వానించి టీ తెప్పించాడు.

అమృతం తను స్వయంగా వ్రాసిన వివరాలు విజిటర్స్ రిజిష్టర్‌లో చూశాడు వినయ్. అమృతం వైఫ్ ఆఫ్ కాశీనాథ్, ఖమ్మం అని వుంది అందులో. పర్పస్ ఆఫ్ విజిట్‌లో బిజినెస్ అని వుంది. అక్షరాలు పొందికగా వున్నాయి.

"బిజినెస్ అంటే ఏమిటో మీరు అడిగారా?" ప్రశ్నించాడు వినయ్!

"అవన్నీ మేం యిలా అడుగుతాం చెప్పండి. వచ్చేవాళ్ళంతా గౌరవనీయులైన కష్టమర్స్ మాకు. గుచ్చి, గుచ్చి అడిగితే బాధపడతారు" అన్నాడు నారాయణరావు.

"గౌరవనీయులుగా కన్పిస్తూ స్మగ్లర్స్, దొంగలు కూడా వస్తుంటారు."

"నిజమే సార్! అవన్నీ జరుగుతూనే వుంటాయి" నవ్వాడు నారాయణరావు.

"ఈ రిజిష్టర్‌లో ఆమె రైటింగ్ ఫోటో తీసుకుంటాను. మీకేమైనా అభ్యంతరమా?"

"నో.... నాటెటాల్!" అన్నాడు.

ఇన్స్పెక్టర్ వినయ్ అమృతం స్వయంగా వ్రాసిన వివరాలు ఫోటో తీశాడు.

"పోతే అమృతం భర్తనని చెప్పుకున్న వ్యక్తి యెలా వుంటాడో చెప్పగలరా?"

"నేనతన్ని చూళ్ళేదు. అప్పుడు మా మురహరి కౌంటర్లో వున్నాడు. పిలిపిస్తాను" అని నారాయణరావు బజర్ నొక్కాడు.

కాసేపటికి మురహరి వచ్చి ఇన్స్పెక్టర్ కి విష్ చేశాడు.

"అమృతం భర్తను మీరు చూశారు గదా! యెలా వుంటాడో వివరంగా చెప్పగలరా?"

"పొడుగ్గా వున్నాడు సార్!"

"ఎంత పొడుగుంటాడు? ఆరడుగులు వుంటాడా?"

"అంత పొడుగు వుండడు సార్. అయిదూ తొమ్మిది వుండొచ్చు. సన్నగా వుండటంవల్ల పొడుగని అనిపిస్తాడు."

"ఐ.సీ...."

"తెల్లటి బట్టలు వేసుకున్నాడు."

"వూఁ...."

"చామనచాయగా వుంటాడు. గడ్డం పెంచుకున్నాడు సార్!"

"ఎంత గడ్డం? రవీంద్రనాథ ఠాగూర్ కి వున్నంత వుందా?" నవ్వాడు ఇన్స్పెక్టర్.

"అంతలేదు సార్! రాఘవేంద్రరావుకి వున్నంత వుంటుంది."

"ఆయనెవరు?"

"సినిమా డైరెక్టర్ సార్!"

"ఓ....ఐ.సీ.... నేను ఆయన్నెప్పుడూ చూళ్ళేదు.

నువ్వు చూశావా?"

"నేనూ చూళ్ళేదు సార్! సినిమా పత్రికలలో చూస్తుంటాను. ప్రతి ఫోటోలోను ఆయనకి గడ్డం వుంటుంది. ఆయన నా ఫేవరెట్ డైరెక్టర్ సార్! మీరు అడివిరాముడు, వేటగాడు...."

"సరే! ఇక ఆ గడ్డం సంగతి వదిలెయ్! మనిషిని గుర్తుపట్టడానికి వుపయోగపడేవి వుంటే చెప్పు."

"సార్! ఇప్పుడు గుర్తొచ్చింది. ఆయనగారి ముఖం మీద కాలిన మచ్చవుంది సార్!"

"దట్సాల్! మళ్ళీ ఆ మనిషిని చూస్తే గుర్తుపడతావా?"

"తప్పకుండా!"

"ఇకపోతే ఆ రిక్షావాడి సంగతేమిటి? వాడు ఎక్కడుంటాడు? ఎలా వుంటాడు?"

"నల్లగా దున్నపోతులా వున్నాడు సార్! తలపాగా చుట్టుకున్నాడు...."

"తెలిసినవాడేనా?"

"నాకు తెలీదు సార్!"

"అతన్ని మీరు తప్ప ఇంకెవరైనా చూశారా?"

"గేటుదగ్గర వాచ్‌మాన్ చూశాడు సార్! రిక్షా లోపలకు రావడానికి వీల్లేదని అడ్డుపెడితే అక్కడ ఆపి తను వచ్చాడు."

"ఆ వాచ్‌మాన్‌ని పిలిపించండి."

తర్వాత వాచ్‌మాన్ వచ్చాడు. అతను గూడా తను ఆ మనిషిని అప్పుడప్పుడూ చూస్తుంటానని చెప్పాడు గాని తెలిసినవాడు మాత్రం కాదన్నాడు. ఇకపోతే ఒక కొండ గుర్తు చెప్పాడు.

ఆ రిక్షా గూడు రిక్షా. దానికి రెండువేపులా సినిమాల పేర్లు రాసివున్నాయి. ఒక వేపు సరదా రాముడు, మరొక వేపు సర్దారు పాపారాయుడు. రెండువేపులా యన్ టి ఆర్ బొమ్మలు కన్పిస్తాయి.

"26 నెంబర్ రూమ్‌లోకి ఎవరైనా వచ్చారా?"

"లేదుసార్ ఖాళీగా వుంది" అన్నాడు మురహరి.

ఇన్స్పెక్టర్ వినయ్ రూమ్ తెరిచి చూశాడు.

డస్టుబిన్‌లో ఆర్.టి.సి. బస్ టిక్కెట్లు దొరికాయి. నాలుగు ముక్కలు చేసి పారేసిన కరపత్రం వుంది. ఆ ముక్కలన్నీ జాయింట్ చేసి చూశాడు.

అదొక నాటకం తాలూకు కరపత్రం. కురుక్షేత్రం నాటకం డిసెంబర్ ఆరో తారీఖు రాత్రి పదిగంటలకు టౌన్ హైస్కూల్లో అని క్రింద రేట్లు వేసివున్నాయి. ఆ నాటకం గుంటూరులో జరగబోతున్నది. అంటే అతను గుంటూరునుంచి వచ్చివుంటాడా?

5

సరదారాముడు, సర్దార్ పాపారాయుడు సినిమాల పేర్లు పెయింట్ చేసిన గూడు రిక్షా పోలీసులు సులభంగానే ట్రేస్ చేశారు.

కాని ఆ బండిని శరభయ్య నడపడంలేదు. ఆ రోజు శరభయ్య రాలేదు. యజమాని దాన్ని గోపయ్యకి ఇచ్చాడు.

తన బండిని పోలీసులు చుట్టుముట్టగానే గోపయ్య భయంతో బిగుసుకు పోయాడు. నేనేమీ ఎరగనని మొత్తుకున్నాడు. నిన్న ఈ బండి తను తోలలేదని చెప్పాడు.

రిక్షాల యజమాని చెప్పిన సమాచారంబట్టి శరభయ్య

నిన్న ఈ బండిని తోలినట్లు పోలీసులకు తెలిసింది.

శరభయ్య సారాయి త్రాగి పడుకున్నాడు. గుర్రుపెట్టి హాయిగా నిద్రపోతున్నాడు. గుడిసెలోకి పోలీసులు రాగానే శరభయ్య పెళ్ళాం గుడ్లు తేలేసి చూస్తుండి పోయింది. శరభయ్యని నిద్రలేపి పోలీస్ స్టేషన్ కి తీసుకు పొయ్యారు.

ముందు తనకేమీ తెలియదని బుకాయించాడుగాని నాలుగు తగలనిచ్చాక నిజం చెప్పాడు. రోశయ్య సలహా మీద అమృతం వంటిమీదున్న బంగారం అంతా తీసుకుని స్మశానంలో పూడ్చిపెట్టామన్నాడు.

కాని వాళ్ళు అనుకుంటున్నట్లు ఆమె వంటిమీదున్నది అంతా బంగారం కాదు. చెవులకువున్న దుద్దులమాత్రమే బంగారం. మెడలో నెక్లెస్, చేతులకున్న గాజులు రోల్డు గోల్డువే. ఆమె కాళ్ళకున్న వెండిపట్టీలు, దుద్దులు అమ్మితే మూడొందలు వచ్చాయి. వాటిని ఇద్దరూ పంచుకున్నారు.

పోలీసులు శరభయ్యతో పాటు, రోశయ్యనుగూడా అరెస్టుచేశారు. ఇద్దరూ కటకటాలు లెక్కపెడుతూ ఏడుస్తూ కూర్చున్నారు ఒకర్నొకరు తిట్టుకుంటూ. పూల్ చంద్ కి అమ్మిన దుద్దులు, పట్టీలు తెచ్చి స్టేషన్ లో పెట్టారు. రోల్డుగోల్డు నెక్లెస్, గాజులు శరభయ్య పెళ్ళాం తెచ్చి ఇచ్చింది.

స్మశానంలో అమృతం శవాన్ని బైటికితీసి ఫోటోలు తీయించాడు ఇన్స్పెక్టర్. తర్వాత పోస్టుమార్టమ్ రిపోర్టు కోసం హాస్పిటలుకు పంపించాడు.

అమృతం విషప్రయోగంవలన మరణించివుండొచ్చునని డాక్టర్ అభిప్రాయం వ్యక్తంచేశాడు. తుది నిర్ణయం కోసం విసిరా తీసి కెమికలు ఎగ్జామినర్ కి పంపించారు.

6

"వెల్కమ్ మిస్టర్ వినయ్!" అంటూ ఆహ్వానించాడు ఇన్స్పెక్టర్ అజీజ్.

ఇన్స్పెక్టర్ వినయ్ విష్ చేసి కూర్చున్నాడు.

ప్రక్కనే కూర్చున్న యువకుణ్ని పరిచయం చేశాడు అజీజ్.

"మీట్ మిష్టర్ ప్రవీణ్, ప్రైవేట్ డిటెక్టివ్."

"గ్లాడ్ టూ మీట్ యూ!" అని ప్రవీణ్ వినయ్‌తో చెయ్యి కలిపాడు.

ముగ్గురూ కాసేపు మాట్లాడుకున్నారు.

"వినయ్! ఏమిటి విశేషాలు? మా ఊరు ఎందు కొచ్చావు?" అడిగాడు ఇన్స్పెక్టర్ అజీజ్.

"డ్యూటీ మీదనే" అన్నాడు వినయ్.

"ఏమిటి సంగతి?"

"ఒక మర్డర్ కేసు ఇన్వెస్టిగేట్ చేస్తున్నాను. హంతకుడు మీ ఊరు వాడని అనుమానం మీద వెతుక్కుంటూ వచ్చాను."

టెలిఫోన్ గణగణ మ్రోగింది.

"మర్డర్ కేసు అనగానే ఫోన్ రింగైంది. ఏదో మర్డర్ కేసు పిలుస్తున్నట్లే వుంది మనల్ని" అంటూ ఇన్స్పెక్టర్ అజీజ్ నవ్వుతూ రిసీవర్ ఎత్తాడు.

"ప్రొద్దున్నే మర్డర్ కేసేమిటి? వేళాపాళా లేకుండా" అన్నాడు వినయ్.

"మర్డర్ ఏ రాత్రో జరుగుతుంది. తెలిసేది ప్రొద్దున్నే గదా!" అన్నాడు డిటెక్టివ్ ప్రవీణ్ నవ్వుతూ.

"మొత్తానికి డిటెక్టివ్ అనిపించుకున్నావు గదా!" అన్నాడు అజీజ్.

"ఇన్స్పెక్టర్ అజీజ్ స్పీకింగ్ ప్లీజ్!"

"సార్! నేను విమల్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీనుంచి మాట్లాడుతున్నాను. మా ప్రొప్రయిటర్ గారిని ఎవరో మర్డర్ చేశారు సార్!"

"ఎవరు నువ్వు?"

"నేనిక్కడ ఎక్కౌంటెంట్ కమ్ టైపిస్టుని సార్!"

"నీ పేరేమిటి?"

"నా పేరు మునుస్వామినాయుడు సార్!"

"సరే మీ ఫ్యాక్టరీ అడ్రస్ చెప్పు."

ఇన్స్పెక్టర్ అజీజ్ విమల్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీ అడ్రస్ నోట్ చేసుకున్నాడు.

"నేను ఇప్పుడే వస్తున్నాను. అక్కడ ఎవర్నీ ఏవీ ముట్టుకోనివ్వకు" అని రిసీవర్ పెట్టేశాడు అజీజ్.

"ఎక్కడ చూసినా మర్డర్ కేసులే!" అని నవ్వాడు వినయ్.

"ఇక మనం హత్యజరిగిన ప్రదేశానికి వెళ్దాం. ముగ్గురం కలిస్తే కేసు తొందరగా తేలిపోతుంది" అన్నాడు అజీజ్.

"ముగ్గురం కలిస్తే కేసు ముందమోస్తుందేమో!" అని నవ్వాడు ఇన్స్పెక్టర్ వినయ్.

విమల్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీ విజయవాడ రోడ్డులో టౌన్ చివరవుంది. పోలీస్ వ్యాన్ వెళ్లేసరికి గుంపులుగా వున్న జనం బెదిరిపోయారు. కానిస్టేబుళ్లు జనాన్ని దూరంగా పంపించివేశారు.

మునుస్వామినాయుడు తనను పరిచయం చేసుకున్నాడు. హత్య జరిగిన ప్రదేశానికి తీసుకెళ్ళారు. హత్య ఆఫీసు రూంలోనే జరిగింది.

"మీ ప్రొప్రయిటర్ పేరు ఏమిటి?" ప్రశ్నించారు అజీజ్.

"హనుమంతరావు" అన్నాడు మునుస్వామినాయుడు.

సోఫా కమ్ బెడ్ మీద వెల్లకిలా పడుకుని వున్నాడు హనుమంతరావు. తలక్రింద దిండువుంది. వంటిమీద బనీనుమాత్రమే వుంది. లుంగీ కాళ్ళమీద కప్పివుంది. గుండెల్లో కత్తిని దించినట్లు గాయం కనిపిస్తోంది. కత్తితో పొడిచినందువల్లే చనిపోయి వుండొచ్చు.

ఇన్స్పెక్టర్ వినయ్‌కుమార్ ఆశ్చర్యంగా చూశాడు హనుమంతరావుని. అమృతం భర్త పోలికలు అన్నీ అతనికి వున్నాయి. పొడుగ్గా వున్నాడు. గడ్డం వుంది. ముఖాన కాలిన మచ్చ. రంగు గూడా చామనచాయే.

'ఇతడు అమృతం భర్త కాదు గదా!' అనే సందేహం మనసులో కుమ్మరిపురుగులా తొలుస్తోంది.

తన జేబులోవున్న డైరీ తిరగేశాడు. అతను హోటలు మధువనం వచ్చిన తేదీ చూశాడు. డిసెంబర్ అయిదో తేదీన వచ్చాడు. అమృతం మీద విషప్రయోగం జరిగింది అదే రోజున సాయంకాలం.

మునుస్వామిని ప్రక్కకు పిలిచి "డిసెంబర్ ఐదో తేదీ మీ ప్రొప్రటర్ ఊళ్ళో వున్నాడా?" అని అడిగాడు ఇన్స్పెక్టర్ వినయ్.

మునుస్వామి గాద్రేజ్ బీరువా తెరిచి ఫైల్లో కాగితాలు తిరగేసి "ఆ రోజు వుదయం హైదరాబాద్ వెళ్ళారు సార్! మళ్ళీ మర్నాటి రాత్రికి తిరిగివచ్చేశారు" అన్నాడు.

"మీ ప్రొప్రయిటర్‌కి ఎవరైనా శత్రువులు వున్నారా?" ప్రశ్నించాడు అజీజ్.

మునుస్వామి తనకేమీ తెలియదని చెప్పాడు.

హత్యకు ఉపయోగించిన కత్తి దొరకలేదు. అది హంతకుడే తీసుకుని పారిపోయి వుంటాడు.

"మీ ప్రొప్రయిటర్ రాత్రిపూట ఇక్కడే పడుకుంటాడా?"

"ఏమోసార్! నే సెప్పుడూ నోటీస్ చెయ్యలేదు" అన్నాడు మునుస్వామి.

"రాత్రిమాత్రం ఇక్కడే పడుకున్నాడు" అన్నాడు డిటెక్టివ్ ప్రవీణ్.

"మీ ప్రొప్రయిటర్ కి పెళ్ళికాలేదా?"

"అయింది సార్! ఇద్దరు పిల్లలుగూడా! ఆ యమ్మకు ఇప్పుడే కబురు పంపాను" అన్నాడు మునుస్వామి.

వినయ్ జేబులోంచి అమృతం ఫోటోతీసి "ఈమె నీకు తెలుసా?" అని అడిగాడు.

మునుస్వామి తల అడ్డంగా వూపి, ఆవిడను ఎన్నడూ చూడలేదని చెప్పాడు.

ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీస్తున్నాడు. ఫింగర్ ప్రింట్స్ కోసం వెతుకుతున్నాడు వేలిముద్రల నిపుణుడు.

"డిటెక్టివ్ గారూ మీ వుద్దేశ్యం ఏమిటి? పరిశోధన మొదలు పెట్టండి" అన్నాడు ఇన్స్పెక్టర్ అజీజ్.

"నా పరిసోధన ఎప్పుడో పూర్తి చేశాను" అన్నాడు ప్రవీణ్.

"ఏమిటి అంత క్విక్ గానా?" ఆశ్చర్యంగా అన్నాడు అజీజ్.

"మనం తీరిగ్గా చెట్టుక్రింద కూర్చుందాం రండి. మర్డర్ చేసిన వాళ్ళని అక్కడికే రప్పిద్దాం" అన్నాడు డిటెక్టివ్ ప్రవీణ్ ఆఫీసు రూంలోనుంచి బైటపడుతూ.

వేపచెట్టుక్రింద కుర్చీలు వేయించాడు మునుస్వామి. ముగ్గురూ అక్కడ కూర్చున్నారు.

"ఈ హత్యచేసింది ఒక ఆడది" అన్నాడు ప్రవీణ్ సిగరెట్ వెలిగిస్తూ.

"ఎలా చెప్తారు? ప్రశ్నించాడు అజీజ్.

"మీరు గమనించలేదేమో! సోఫాక్రింద చిన్న చిన్న గాజు ముక్కలు వున్నాయి. బంతిపూల రేఖలు సోఫాలో ఇరుక్కుపోయి కనిపిస్తున్నాయి. తర్వాత హనుమంతరావు ఆఫీసురూమ్‌లో పడుకోవడానికి కారణం ఏమిటి? అవసరం ఏమిటి? సింపుల్. అతను పరాయి ఆడదానితో గడపడానికి మాత్రమే అని మనం అనుకోవచ్చు. అది గూడా అతని ఫ్యాక్టరీలో పనిచేసే ఆడమనిషి కూడా అయివుంటుంది" అన్నాడు డిటెక్టివ్ ప్రవీణ్.

ఇన్స్‌పెక్టర్ అజీజ్ తల వూపాడు.

"హంతకురాలు ఎవరో ఇప్పుడే తేల్చివేస్తాను. మునుస్వామినాయుడ్ని పిలిపించండి" అన్నాడు ప్రవీణ్.

అజీజ్ కానిస్టేబులుతో మునుస్వామినాయుడికి కబురు చేశారు.

అతను వచ్చి చేతులు కట్టుకుని నిల్చున్నాడు. అతనిలో అంతులేని ఆందోళన కనిపిస్తోంది.

"చూడండి నాయుడుగారూ! మీకు తెలిసిన విషయాలు దాచకుండా చెప్పాలి" అన్నాడు ప్రవీణ్.

అతను తల వూపాడు.

"మీ ప్రొప్రయిటర్ లేనప్పుడు అన్ని వ్యవహారాలూ మీరే చూస్తారుగదూ?"

"అవును సార్!"

"మీ ప్రొప్రయిటర్‌కి స్త్రీ వ్యసనం వుంది గదూ?"

మునుస్వామి తల వూపాడు నిజమేనన్నట్లు.

"వెరీగుడ్! పోతే మరొక్క సంగతి. మీ ఫ్యాక్టరీలో యెంతమంది ఆడవాళ్ళు పని చేస్తున్నారు?"

చెప్పాడు మునుస్వామి.

"అందులో మీ ప్రొప్రయిటర్ కి యెవరితోనన్నా సంబంధం వుందా?"

"నాకు అంతగా తెలియదు సార్! నేను అవన్నీ పట్టించుకోను" అన్నాడు అతను.

"పోనివ్వండి మీకు తెలియకపోతే. నైట్ వాచ్ మాన్ వున్నాడా?"

"వున్నాడు సార్!"

"రాత్రి డ్యూటీ చేసిన అతను ఎవరు?"

"కొండయ్య సార్!"

"ఇప్పుడు వున్నాడా?"

"వున్నాడు సార్! అతనే ముందు శవాన్ని చూసింది" అన్నాడు మునుస్వామినాయుడు.

"పిలిపించండి" అన్నాడు ప్రవీణ్.

ఖాకీ బట్టల్లో లావుగా, పొట్టిగా వున్న కొండయ్యకి ఏభై ఏళ్ళు పయినే వుంటాయి. బట్టతల. పిల్లి కళ్ళు. భయం భయంగా వచ్చాడు.

"నీ పేరు కొండయ్య కదూ?" ప్రశ్నించాడు ప్రవీణ్.

"అవునయ్యా!...." వినయంగా వంగుతూ చెప్పాడు కొండయ్య.

"కొండయ్యా! మీ అయ్యగారి శవాన్ని అందరికంటే ముందు చూసింది నువ్వే కదూ?"

"అవునయ్యా!.... తెల్లవారాక అయ్యగారి ఆఫీసు తలుపులు తీసివుంటే ఏమయినా కావాలేమో అడగడానికి

వెళ్ళానయ్యా! వెళ్ళేసరికి చచ్చిపోయి వుండారు. భయం వేసి పారిపోయి వచ్చాను. ఆ సంగతి నాయుడిగారింటికి వెళ్ళి చెప్పాను” అన్నాడు కొండయ్య.

“మీ అయ్యగారితో పాటు రాత్రి వున్న ఆడమనిషి యెవరు?”

కొండయ్య ఆ ప్రశ్నకు అదిరి పడ్డాడు.

“ఆడమనిషా?....ఎవరూ లేరు బాబూ!” అన్నాడు బుర్ర గోక్కుంటూ.

“వున్నారు. ఎవరో నీకు బాగా తెలుసు” అన్నాడు ప్రవీణ్.

“లేదయ్యా!....ఆడోళ్ళెవరూ లేరు. అయ్యగారే పొద్దుపోయేదాకా పని చేసుకుని పడుకున్నారు”అన్నాడు కొండయ్య.

“చూడు కొండయ్యా! నన్ను అనవసరంగా వాగించకు. మర్యాదగా చెప్పు!”

ఎంత అడిగినా యెవరూ లేరనే చెబుతూ వచ్చాడు కొండయ్య.

“ఇన్స్పెక్టర్ గారూ! కొండయ్య దగ్గరే వుంది కీలు. తగిన విధంగా సత్కరిస్తే తెలుస్తుంది” అని నవ్వాడు ప్రవీణ్.

ఇన్స్పెక్టర్ అజీజ్ కొండయ్యను దూరంగా ఫ్యాక్టరీ షెడ్ లోకి తీసుకెళ్ళి బెల్టుతో నాలుగు తగలనిచ్చాడు.

ఆ దెబ్బలకు తట్టుకోలేక కొండయ్య నిజం చెప్పాడు. రాత్రి తన యజమానితో మాలతి అనే ఆవిడ వుందని, కాని యెవరికీ చెప్పవద్దని కొండయ్యకి వందరూపాయిలు లంచం యిచ్చింది.

మంగళ్‌దాస్ నగర్లో ఒక పెంకుటింట్లో వుంటోంది మాలతి.

పోలీసులు తన ఇంటికి వస్తారని ఆమె వూహించలేదు. అందుకే నిర్భయంగా ఇంట్లోనే వుంది.

పోలీస్ వ్యాన్ కొండయ్యతో సహా వస్తున్న పోలీసుల్ని చూసి స్థాణువైపోయింది మాలతి. ఎటూ పోవడానికి దారిలేక నిలబడిపోయింది. ఆమెను పట్టుకుని వ్యాన్‌లో యెక్కించి స్టేషన్‌కి తీసుకుపోయారు.

శ్రమ పడకుండానే తను చేసిన నేరం ఒప్పుకుంది మాలతి. హత్య చేయడానికి కారణం పగ. ఆమె తన కథ చెప్పింది.

మాలతి భర్త ధర్మారావు. మాలతి అతని రెండో భార్య. ఏభై సంవత్సరాల వయస్సులో భార్య చనిపోతే మాలతిని పెళ్ళి చేసుకున్నాడు. మాలతికి పెళ్ళినాటికి పాతికేళ్ళు. ఆమె పెళ్ళి అప్పటివరకూ జరగకపోవటానికి కారణం పుట్టింటి దరిద్రమే.

ధర్మారావు మొదటి భార్యకు ఇద్దరు కొడుకులు. పెద్దబ్బాయి డాక్టర్. రెండో కొడుక్కి చదువు అబ్బలేదు. బిజినెస్‌లో వున్నాడు. ధర్మారావుకి హోల్‌సేలు మెడికలు షాపు వుంది.

హనుమంతరావు ఆ షాపులో పని చేసేవాడు. ధర్మారావు ఆరోగ్యం సరిగా వుండేది కాదు. షుగర్ కంప్లయింట్‌తో బాధపడుతూ వుండేవాడు. అప్పుడప్పుడూ నర్సింగ్ హోమ్‌లో ఇన్ పేషెంట్‌గా వుండాల్సొచ్చేది.

పరిస్థితులకు రాజీపడి మాలతి ధర్మారావుని పెళ్ళి చేసుకుంది కాని, ఆమెకు ఏమీ సుఖం లేకుండా పోయింది.

రోగిష్టి భర్తకు సేవలు చెయ్యటం, కోరికలతో మండి పోతూ నిద్ర పట్టక నరకం అనుభవించటం ఆమె ఎక్కువ రోజులు భరించలేకపోయింది.

హనుమంతరావుతో ఆమెకు సంబంధం కలిగింది. దొంగ తనం, రంకుతనం యెక్కువ రోజులు దాగవు.

ధర్మారావు చిన్న కొడుకు పిన్నిగారి రహస్య ప్రేమ కలాపం గ్రహించాడు. తండ్రికి చెప్పి పిన్నిని అల్లరిపాలు చెయ్యటం బాగుండదనీ అందువల్ల ప్రయోజనమూ వుండ దనీ తెలుసుకుని, హనుమంతరావుకి వుద్వాసన చెప్పి ఒక వయసు మళ్ళినవాడిని పనిలో పెట్టుకున్నాడు.

పనిలోనుంచి తీసివేసినా వాళ్ళమధ్య సంబంధం నిరా టంకంగా కొనసాగుతూనే వుంది. హనుమంతరావుకు తనే కావలసిన డబ్బు యిస్తూ ఇబ్బంది లేకుండా చూస్తూ వుంది మాలతి. కాని ఇదివరకటిలా ఆమె అతనితో సుఖం అనుభవించడానికి వీల్లేకుండా వుంది.

హనుమంతరావు ఆమె అవస్థ గ్రహించి ఒక వుపాయం చెప్పాడు. అది ధర్మారావుని గుట్టుచప్పుడు కాకుండా పైకి పంపించి వెయ్యడం.

ఈ లోపల ఆమె తన నగలన్నీ తెచ్చి ఇవ్వాలి. వీలైనంత డబ్బు గూడా చేర్చాలి. దినవారాలైన తర్వాత ఆమె కొన్నాళ్ళు పుట్టింట్లో గడుపుతుంది. ఈ లోపల హనుమంతరావు తన స్వస్థలమైన గుంటూరులో ఆ డబ్బుతో ఏదోక బిజినెస్ చేపడతాడు. కొన్ని రోజులు గడిచాక ఇద్దరూ పెళ్ళిచేసుకుని హాయిగా వుంటారు. అదీ పథకం.

మాలతి అందుకు సంతోషంగా ఒప్పుకుంది. తన నగలన్నీ హనుమంతరావుకి ఇచ్చింది.

కాని ధర్మారావుకి విషం ఇచ్చి చంపడం బైటికి పొక్కింది. పోలీసులు ఆమెమీద నేరాన్ని రుద్దారు. చిన్న కొడుకు సాక్ష్యం చెప్పాడు. ఆమె అక్రమ ప్రవర్తన వెల్లడైంది. ఆమే విషం ఇచ్చి చంపినట్లు రుజువైంది. ఏడేళ్ళు జైలుశిక్ష వేశారు. హనుమంతరావుకి ఏ ప్రమాదమూ జరగలేదు.

గుంటూరులో హనుమంతరావు ప్లాస్టిక్ ఫ్యాక్టరీ పెట్టుకున్నాడు. పెళ్ళిచేసుకున్నాడు. హాయిగా వున్నాడు. మాలతి జైలునుంచి తిరిగివచ్చేసరికి అతనికి ఇద్దరు పిల్లలు పుట్టారు.

హనుమంతరావు, మాలతికి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. ఆమె జైలునుంచి తిరిగివచ్చేవరకూ పెళ్ళిచేసుకోకుండా బ్రహ్మచారిగా వుంటాననీ ఆమెను తప్ప ఎవర్నీ పెళ్ళిచేసుకోననీ మాలతిని నమ్మించాడు.

ఆమె జైలులో ఎన్నో కలలుకంది. ఏడేళ్ళ తర్వాత ఆమె తన జీవితం సుఖంగా గడిచిపోతుందనీ, హనుమంతరావు తనను పెళ్ళిచేసుకుంటాడనీ ఆశతో కాలం గడిపింది.

జైలునుంచి తిరిగివచ్చాక తనను హనుమంతరావు మోసంచేశాడని గ్రహించింది. మాలతికి అతను ఏదో నచ్చజెప్పాడు. తన తల్లి రోగంతోవుండి చనిపోయేలోపల పెళ్ళిచేసుకోమని కోరిందనీ అందువల్ల పెళ్ళిచేసుకోక తప్పలేదనీ చెప్పాడు.

అయినా సరే తననుగూడా పెళ్ళిచేసుకోమని మాలతి అతన్ని కోరింది. కాని హనుమంతరావు అందుకు ఒప్పుకో

లేదు. ఆమెను వుంపుడుగత్తెగా మాత్రమే వుంచాడు. తన నగలన్నీ కాజేసి వాటిని అమ్మి ఇంతవాడైన హనుమంతరావు తనకు ద్రోహంచెయ్యడం ఆమె భరించలేక పోయింది. అందుకే సమయం చూసి అతన్ని హత్య చేసింది.

ఇన్స్‌పెక్టర్ వినయ్ హనుమంతరావు డెడ్ బాడీ ఫోటో ఒకటి తీసుకుని డైరీలో పెట్టుకున్నాడు. తను వచ్చిన పని చెప్పేసరికి ఇన్స్‌పెక్టర్ అజీజ్ గూడా ఆశ్చర్యపోయాడు. హనుమంతరావు అమృతం అనే ఆవిడని విషప్రయోగంతో చంపి, తప్పించుకుని వచ్చిన కథంతా శ్రద్ధగా విన్నాడు.

"అమృతాన్ని చంపిన వ్యక్తి ఇతనేనని అనుమానిస్తున్నాను. వాళ్ళు చెప్పిన పోలికలన్నీ ఇతనికి సరిపోయాయి. పైగా డిసెంబర్ ఐదో తారీఖున తను హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి ఆ మర్నాడు తిరిగి వచ్చాడట" అన్నాడు వినయ్.

"వీడు నిజంగా దేవాంతకుడే. ఆడవాళ్ళను వలలో వేసుకుని డబ్బు సంపాదించడంలో మొనగాడిలా వున్నాడు. ఆ అమృతం కథ గూడా ఇదే ననుకుంటా. పెళ్ళిచేసుకుంటానని మోసం చేసి డబ్బులాగి వుంటాడు దుర్మార్గుడు" అన్నాడు ఇన్స్‌పెక్టర్ అజీజ్.

"ఇది అమృతం డెడ్ బాడీ ఫోటో. మీ దగ్గర వుంచండి. అవసరమైతే నన్ను పిలవండి. మెసేజ్ ఇస్తే వస్తాను. ఆమెను హత్యచేసిన వ్యక్తి హత్యచేయబడ్డాడు. కాబట్టి, మాకు ఇబ్బందిలేదు. ఇక అమృతం ఎవరో తెలుసుకోవాలి" అన్నాడు ఇన్స్‌పెక్టర్ వినయ్.

8

హనుమంతరావు డెడ్ బాడీ ఫోటో చూపిస్తే హోటలు మధువనంలో రూమ్ బాయ్, మురహరి అతనే అమృతం భర్తనని చెప్పిన మనిషి అని గట్టిగా చెప్పారు. రిక్షా పుల్లర్ శరభయ్య కూడా హనుమంతరావుని గుర్తు పట్టాడు.

అమృతం మీద విషప్రయోగం చేసిన వ్యక్తి మర్డర్ కావించబడినప్పుడు కేసు పెట్టే పనిలేదు. కేసు తేలిపోయిందని పోలీసు అధికారులు భావించారు.

అయితే అమృతం ఎవరో తెలుసుకునేందుకు ఆమె డెడ్ బాడీ ఫోటోలు అన్నీ పోలీస్ స్టేషన్ లకీ పంపించారు ఎవరైనా గుర్తుపడితే తెలియజేయమని. అదొక మంచి పనే అయ్యింది.

అమృతం తను ఖమ్మంనుంచి వచ్చినట్లు రిజిష్టర్లో రాసింది. అది తప్పు. పైగా తను కాశీనాథ్ భార్యనని రాసిందీ శుద్ధ తప్పే. ఆమెకు పెళ్ళికాలేదు. ఆ గడ్డం మనిషి రిక్షా శరభయ్యతో తాము ఏలూరునుంచీ వచ్చామని చెప్పిందీ అబద్ధమే. అసలు అమృతం పేరు అమృతమే కాదట.

ఆమె అసలు పేరు అరుంధతి. రెండేళ్ళ క్రితం ఆమె నొక వ్యభిచార గృహంలో చూశాననీ, రెయిడింగ్ లో ఆమెను పట్టుకుని కోర్టులో హాజరుపెట్టాననీ ఇన్స్పెక్టర్ కుమార్ కాకినాడనుంచి తెలియచేశాడు.

ఇన్స్పెక్టర్ వినయ్ కి మళ్ళీ ప్రయాణం తగిలింది. కాకినాడ వెళ్ళి ఇన్స్పెక్టర్ కుమార్ ని కలుసుకున్నాడు.

"ఆమె అరుంధతే. సందేహంలేదు" అన్నాడు కుమార్.

ఇద్దరూ కలిసి కాంతమ్మ ఇంటికి వెళ్ళారు. చంద్ర కాంతం ఏభై ఏళ్ళు పైబడిన వారకాంత. లావుగా కదల్లేకుండా వుంది. పాన్ లు నవుల్తూ గారపట్టిన పళ్ళను బైటికిపెట్టి ఏడవలేక నవ్వింది. పోలీసుల్ని చూసి ఎక్కడి వాళ్ళక్కడ సర్దుకున్నారు గప్ చిప్ గా. అప్పుడు మధ్యాహ్నం ఒంటిగంట దాటింది.

"కంగారుపడకు రైడింగ్ కి రాలేదులే" అని అభయ మిచ్చాడు కుమార్.

చంద్రకాంతం ముఖంలోకి కాస్త కళవచ్చింది. ఇద్దర్నీ మెత్తటి సోఫాల్లో కూర్చోబెట్టింది. కూల్ డ్రింక్స్ తెప్పించి టీపాయ్ ముందు పెట్టింది. భోజనంచేసే వేళ యిందని ఇద్దరూ తీసుకోలేదు.

"మర్యాదాలకేమిలే. ముందు ఈ సంగతి చెప్పు? నీ ఇంట్లో అరుంధతి అనే అమ్మాయి వుండాలి ఏమైంది? ఇప్పుడు వుందా?" అని ప్రశ్నించాడు కుమార్.

"ఎక్కడ అరుంధతి బాబూ! ఎప్పుడో వెళ్ళిపో యింది" అంది చంద్రకాంతం.

"ఎక్కడికి పోయింది?"

"ఎవరో ఒక బాబొచ్చాడు. దాన్ని బాగుసేస్తానని వెంట తీసికెళ్ళాడు."

"ఎన్నాళ్ళయింది?"

"సంవత్సరన్నర పైనే అయ్యింది."

"ఎవరా బాబు?"

"ఏమో! నాకు పేరు తెలీదు."

"ఈ వూరేనా?"

"కాదు. బెజవాడని చెప్పాడు."

"ఇంకా ఏం చెప్పాడు?"

"ఎందుకు బాబూ ఇయ్యన్నీ అడుగుతున్నారు?" తన అనుమానం బైటపెట్టింది చంద్రకాంతం.

ఇన్స్పెక్టర్ వినయ్ అమృతం డెడ్ బాడీ ఫోటో చంద్రకాంతానికి అందించాడు. అది చూసి చంద్రకాంతం లబలబ కొట్టుకుంది. బంగారంలాంటి పిల్లను చంపాడని ఏడ్చింది. దానికి చావు రాసిపెట్టి తన దగ్గర్నుంచి వెళ్ళిపోయిందని విచారించింది.

"అరుంధతిని తీసుకెళ్ళాడని చెప్పిన అతనికి గడ్డం వుందా?"

"గడ్డంలేదు ఏమీలేదు. కుర్రాడే బాబూ! దాన్నేం మాయ చేశాడోగాని వెళ్ళిపోతానని కూసుందా తెలివి తక్కువ ముండ. అది నాకియ్యాల్సిన డబ్బంతా కట్టి తీసుకపొయ్యాడు."

"బెజవాడలో ఏం చేసేవాడో చెప్పాడా?"

"ఆ కుర్రాడు నాకేం చెప్పలేదు బాబూ! అదే చెప్పింది అన్నీ."

"ఏం చెప్పింది."

"ఏదైనా పని నేర్పిస్తానని చెప్పాడంట. చదువుకుంటే చెప్పిస్తానన్నాడంట."

"అది సరే! అతనేం చేసేవాడో చెప్పాడా?"

"అతనికి ఏదో వ్యాపారం అని చెప్పింది. అంతకంటే నాకేం తెలీదు" అంది చంద్రకాంతం.

ఇన్స్పెక్టర్లు ఇద్దరూ ముఖాలు చూసుకున్నారు. అతని అడ్రస్ ట్రేస్ చెయ్యడం ఎలాగో అర్థంకాలేదు.

వినయ్ మనసులో ఒక మెరుపు మెరిసింది.

"అరుంధతితో బాగా స్నేహంగా వున్న అమ్మాయితో అన్నీ చెప్పివుంటుంది. ఆమెతో స్నేహంగా తిరిగిన

అమ్మాయి ఎవరైనా వుంటే పిలిపించండి. ఆమెకు అన్నీ తెలిసివుంటాయి" అన్నాడు ఇన్స్పెక్టర్ వినయ్.

చంద్రకాంతం వనజని పిలిపించింది. వనజకి పాతికేళ్లు వుండొచ్చు. సన్నగా రివటలా వుంది. మనిషి ఎరుపుగానే వుంది గానీ ముఖంలో కళ లేదు. పాలిపోయినట్లు వుంది.

"నీ పేరు ఏమిటి?"

"వనజ."

"అరుంధతి నీతో స్నేహంగా వుండేదా?"

అవునన్నట్లు తలవూపింది.

"ఆమె ఇక్కడ్నుంచి ఎవరితోనో వెళ్ళిపోయింది కదూ? ఎవరతను?"

"అతని పేరు బాబూరావు."

"అతనితో ఎందుకెళ్ళిందో నీకేమైనా చెప్పిందా?"

ఆమె ఇబ్బందిగా ముఖాలవంక చూసింది.

"చెప్పమ్మా ఫర్వాలేదు" అన్నాడు వినయ్.

"బాబూరావు చాలా మంచివాడట. అరుంధతి పదివరకు చదువుకుని ఇటువంటి పాడుపని చేస్తున్నందుకు విచారించాడట. అరుంధతి చాలా బాగుంటుంది. ఆమె అందం అతన్ని ఆకర్షించిందట. తనవెంట బెజవాడ వచ్చేస్తే ఆమెను శాశ్వతంగా పోషిస్తానని చెప్పాడు. ఆమె స్వతంత్రంగా బ్రతకడానికి ఏదైనా పని నేర్పిస్తానన్నాడట. చదువుకుంటానంటే చదువుగూడా చెప్పిస్తానన్నాడట. ఇంత చిన్న వయసులో ఈ నరకంలో జేరి నాశనమై పోతావని హెచ్చరించాడట. అరుంధతికి అతనూ నచ్చాడు. అతనితో వెళ్ళిపోయింది" అంది వనజ.

"బాబూరావు బెజవాడలో ఏం వ్యాపారం చేసే

వాడు?"

"అతను మోటారు సైకిళ్ళూ, కార్లు బాగు చేసేవాడట" అంది వనజ.

"బాబూరావుని నువ్వు చూశావా?"

"చూశాను."

"మనిషి ఎలా వుంటాడు?"

"సన్నగా పొడుగ్గా వుంటాడు."

"ఇంకా?"

వనజ ఆలోచిస్తోంది.

"ముఖం మీద మచ్చ ఏదైనా వుంటుందా?"

"నాకంత గుర్తులేదు."

"అరుంధతి నీతో బాగా స్నేహంగా వుండేది కదా! బెజవాడ వెళ్ళాక నీకు వుత్తరాలు రాసేదా?"

వనజ తల అడ్డంగా వూపింది.

9

బెజవాడ మోటార్ వర్కుషాపులో బాబూరావు, షేక్ పార్టనర్స్. దాన్ని కనుక్కోవడం ఏమంత కష్టంకాలేదు పోలీసులకు.

పెద్ద రేకుల షెడ్‌లో రిపేరులో వున్న లారీలు, మోటారుసైకిళ్ళు వున్నాయి. మెకానిక్‌లు నిర్విరామంగా ఏకాగ్రతతో పనిచేస్తున్నారు.

బాబూరావు షెడ్‌లోలేడు. షేక్ ఆఫీసురూమ్‌లో కూర్చుని టెలిఫోన్ ముందు జపం చేస్తున్నాడు.

ఇన్స్‌పెక్టర్ వినయ్ తనను పరిచయంచేసుకుని బాబూరావు కోసం వచ్చానని చెప్పాడు.

"బాబూరావు కోసం వచ్చారా! పాపం వాడి లైఫ్ ఒక ట్రాజెడీ అయిపోయింది సార్!" అన్నాడు షేక్.

"ఏం జరిగింది?"

"వాడి భార్య ఇద్దరు పిల్లలు చనిపోయారు. ఇక వాడికి ఎవరున్నారు?"

"అవును. అదంతా విన్నాను. మావాళ్ళు చెప్పారు ఆ కథంతా. ప్రమాదవశాత్తు విషాహారం తిని అతని భార్య పిల్లలు మరణించారని చెప్పారు."

"మీవాళ్ళు చెప్పినదంతా నిజంకాదు సార్!"

"మరి నిజం ఏమిటి?"

"ఇదంతా వాడి తలరాత. చేతులారా తన జీవితం నాశనం చేసుకున్నాడు. అరుంధతివల్ల జరిగింది."

"అరుంధతి అంటే కాకినాడనుంచి తీసుకొచ్చిన అమ్మాయే గదా!"

"అవును సార్! అదో రాక్షసి. దాన్ని అమాయకంగా నమ్మి బాబూరావు మోసపోయాడు. ఆ కంపెనీ ముండని బాగుచేద్దామని దానికొక కుట్టుమిషను కొనిపెట్టి, ప్రత్యేకంగా ఒక మనిషిని బట్టలు కుట్టడానికి ఏర్పాటు చేశాడు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టాడు. కాని దానికి విశ్వాసం అనేది లేకుండాపోయింది" అన్నాడు షేక్.

"అరుంధతి ఏం చేసింది?"

"అదే చెప్పబోతున్నాను సార్! వీడి మంచితనం చూసి దానికి దురాశపుట్టింది. వాడిని ఎట్లాగైనా పెళ్ళి చేసుకోవాలని ఆ ముండ వాళ్ళు తినే ఆహారంలో విషం కలిపింది. ఆ రోజు బాబూరావు ఇంటికి వెళ్ళేసరికి ఏముంది? అంతా అయిపోయింది."

"మీరు ఎలా చెప్పగలుగుతున్నారు అరుంధతి వాళ్ళకి విషం పెట్టిందని?"

"తర్వాత నమ్మకంగా తెల్సింది సార్! అరుంధతి

బాబూరావు భార్య పిల్లలు తిన ఆహారంలో విషం కలిపిందని. కాని అది రుజువు కాలేదనుకోండి. బాబూరావు మాత్రం తను అరుంధతికి సహాయం చేసినందుకు విచారించాడు. దాని అంతు చూస్తానని నాతో అన్నాడు."

"అరుంధతి అమృతం అనే పేరుతో హోటలు గదిలో దిగింది. దానికి కారణం ఏమిటో తెలుసా?"

షేక్ నవ్వాడు.

"దాని వేలుతో దాని కన్నే పొడిచాడు బాబూరావు. తను ఆమెను తిరపతిలో పెళ్ళిచేసుకుంటానని నమ్మించాడు. కాని ఈ సంగతి తన బంధువులకు తెలిస్తే అడ్డుపడతారనీ అందుకు ఆమెను పేరు ఊరు మార్చుకుని హోటల్లో దిగితే తను తర్వాత వచ్చి కలుసుకుంటానని చెప్పి పంపాడు."

"ఆ తర్వాత జరిగిందంతా మాకు తెలుసు. తన భార్య పిల్లలికి అరుంధతి విషం యిచ్చిందనే కసితో ఆమెకూ అదే గతి పట్టించాడు బాబూరావు. ఎంత తెలివిగా చేసినా మా దృష్టినుంచి తప్పించుకోలేడు. ఇంతకీ బాబూరావు ఎక్కడున్నాడో మీకు తెలుసా?" అన్నాడు ఇన్స్పెక్టర్ వినయ్.

"తెలుసు" అన్నాడు షేక్.

"తెలిస్తే చెప్పండి. ఎప్పటికైనా హంతకుడు శిక్షించబడాలిగదా!"

"వాడికి జీవితంమీద విరక్తి కలిగింది. అందుకే హిమాలయాలకు వెళ్ళిపోయాడు. మళ్ళీ రాననీ సాధువుల్లో కలిసిపోతానని చెప్పాడు" అన్నాడు షేక్.

"హిమాలయలకు వెళ్ళినా, అమెరికా వెళ్ళినా మా

నుంచి తప్పించుకోలేదు! మీ పార్ట్‌నర్‌ని రప్పిస్తాను చూడండి" అన్నాడు ఇన్స్‌పెక్టర్ వినయ్.

విచిత్రం ఏమిటంటే హనుమంతరావులో, బాబూరావు పోలికలు చాలా వుండటంవల్ల అతనే అమృతం భర్తగా అందరూ పొరబడటం జరిగింది.

—: ఐపోయింది :—